క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఫ్లాగ్ మార్చ్ పై శిక్షణ



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఫ్లాగ్ మార్చ్‌పై శిక్షణ ఇచ్చారు. ఆదివారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో హైస్కూల్‌లో చదువుతున్న 35 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు. రేపల్లె మండలం పేటేరు లోని మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్‌లో వీరు రాత పరీక్షకు హాజరు కానున్నట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ కొండపల్లి కుటుంబరావు తెలిపారు. హైస్కూల్‌కు చెందిన జీవ శాస్త్ర, విశ్రాంత ఉపాధ్యాయులు కె.శివరామకృష్ణ, పలగాని గోవిందరాజులు రాత పరీక్షకు సంబంధించిన సామాగ్రిని సమకూర్చి ఆర్థిక చేయూతను అందించారు.

కోదండ రామాలయంలో పూజలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో శ్రీ కోదండరామ స్వామి వారి దేవాలయ పునః ప్రారంభోత్సవం సందర్భంగా నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాలలో భాగంగా ఈ నెల 29న ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థాన అభివృద్ధి కమిటీ తెలిపింది.

వేడుకగా పాఠశాల వార్షికోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని తమ్మన మల్లికార్జునరావు హైస్కూల్ 80వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత హిందీ పండిట్ లక్కరాజు సత్యన్నారాయణ, పీఏసీఎస్ చైర్ పర్సన్ గుమ్మడి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకున్న విద్య, క్రీడలు, కళలు జీవితాంతం ఉపయోగపడతాయని తెలిపారు. ఆనందమయమైన జీవితానికి పాఠశాల వేదిక లాంటిదని పేర్కొన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకు వెళ్లాలని కోరారు. వ్యవస్థాపకుల సేవలు, ఆశయాలను వక్తలు కొనియాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ పూర్వ విద్యార్థి, పోలీస్ స్టేషన్ రైటర్ సైకం నాగరాజు ఇటీవల ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



బాపట్ల: బాపట్ల పట్టణంలోని గౌతమి హోటల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. న్యూకమ్ సన్‌రేడియా కంపెనీ, సాయి ట్రేడర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని ఉచిత సేవలు అందించారు. రైతులు, ఫెర్టిలైజర్ డీలర్స్‌తో పాటు పలువురికి వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాసిని కంటి హాస్పిటల్ వైద్యులు షేక్.రహీమ్‌బాషా, వై.నరసింహారావు, కెమికల్స్ కంపెనీ నుంచి ఎస్.కె.సర్దార్‌బాషా, సైదా, సలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసి యున్న శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువును నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీలక్ష్మి కూచి పూడి నృత్య కళా ఖండం ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురు దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి అధ్యక్షులు ఆర్‌వి.కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

దర్జీల బతుకుల్లో 'చేదోడు' వెలుగులు

- సీఎం జగన్ నిర్ణయంతో మారిన దర్జీల దుర్భర జీవితాలు
- జగనన్న చేదోడు పథకంతో ఊరట



దుస్తులు కుడుతున్న పనిలో నిమగ్నమైన దర్జీలు

భట్టిప్రోలు: పండుగలు, శుభకార్యాలు వస్తున్నాయంటే చాలు.. నెల రోజుల ముందే బట్టలు కొని కుట్టించేందుకు దర్జీకి ఇవ్వడం, ఆ రోజు అందిస్తారో లేదోనని ఎదురు చూడటం..కుట్టే వరకు షాపుల చుట్టూ తిరగడం ఇవన్నీ గతం. ఇప్పుడు పరిస్థితులు, అభిరుచులు మారాయి. దర్జీ రంగంపై పెట్టుబడి దారుల కన్ను పడటంతో రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. దీంతో దర్జీల జీవితాల్లో బాధలు మొదలయ్యాయి. అతుకుల బతుకులకు టాకాలు వేసుకుంటున్న దర్జీలు రెడీమేడ్ ధాటికి తట్టుకోలేక దుకాణాలు సర్దుకుంటున్నారు. చాలామంది దర్జీలు చేతి నిండా పని దొరకక నెలవారీ జీతాలకు రెడీమేడ్ దుస్తుల కంపెనీలలో పని చేస్తున్నారు. తగ్గిన గిరాకీకి తోడు అద్దె, విద్యుత్ ఛార్జీలు, పని చేసే వారికి జీత భత్యాలు ఇవ్వడం భారంగా మారింది. ఇది వరకు మాస్టర్ టైలర్స్‌గా వెలిగిన వాళ్లు సైతం ప్రస్తుతం రెడీమేడ్ కంపెనీలలో కూలీలుగా పని చేస్తున్నారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే తమ సంక్షేమం కోసం ఆలోచించారని దర్జీలు చెబుతున్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగా ప్రకటించిన విధంగా ముఖ్యమంత్రి అయిన వెంటనే దర్జీల సంక్షేమానికి నిధులు కేటాయించారు. దీంతో దర్జీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో దర్జీలకు జగనన్న చేదోడు పథకం కింద గత ఏడాది 114 మంది, ఈ ఏడాది 147 మంది రూ.10 వేలు చొప్పున పొందడం జరిగింది.

ముఖ్యమంత్రికి అభినందనలు

ఏళ్ల తరబడి దర్జీలను పట్టించుకోని గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఏపీ టైలర్ల సమాఖ్య పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఓట్ల కోసమేనని అప్పట్లో టైలర్లు ప్రభుత్వ తీరును తప్పు పట్టారు. 2013 ఎన్నికలకు ముందు ఆ నాటి ప్రభుత్వం కోటి రూపాయలతో హైదరాబాదులో ఫెడరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన దాన్ని టీడీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దర్జీలు వాపోతున్నారు. మా బాధలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి టైలర్ల సంక్షేమానికి ఏ ప్రభుత్వ చేయనటువంటి పని చేశారని దర్జీలు అభినందిస్తున్నారు. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఈ సహాయం ఎంతగానో ఉపయోగ పడుతుందని అంటున్నారు.

దర్జీలను ఆదుకోవాలనే ఆలోచన వైఎస్ఆర్‌దే

చేతనైన వృత్తిని వదలలేక, కొత్త వృత్తిని చేపట్టలేక దర్జీలు సతమతమవుతున్న తరుణంలో వారి జీవితాల్లో వెలుగులను నింపేందుకు వైఎస్సార్ 2009 మార్చి ఒకటో తేదీన జీవో ఎంఎస్ నెంబర్ 86 ను విడుదల చేశారు. చెన్నై, కేరళ ప్రభుత్వాల తరహాలో రాష్ట్రంలో కూడా దర్జీలకు సదుపాయాలు అందజేయాలని ఆకాంక్షించారు. 2009 మే 14న రాష్ట్ర ప్రభుత్వం దర్జీలను కోఆపరేటీవ్ సొసైటీ ఫెడరేషన్‌గా ప్రతిపాదించింది. దీని వల్ల రాష్ట్రంలోని దర్జీలకు ప్రయోజనం చేకూరుతుందని తలచిన వైఎస్సార్ పారిశ్రామిక ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశించారు. జీవో జారీ చేసిన తరువాత కోటి రూపాయల నిధులను కూడా కేటాయించారు. దురదృష్ట వశాత్తు వైఎస్సార్ దుర్మరణం పాలయ్యారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం చేనేత జౌళి శాఖకు నిధులు కేటాయించకపోవడంతో దర్జీలు పరిస్థితుల్లో మార్పు కనపడలేదు. ముఖ్యమంత్రి జగన్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత జగనన్న చేదోడు పథకం ద్వారా ఇచ్చిన మాట ప్రకారం దర్జీల ఖాతాల్లో రూ.10 వేలు ప్రతి ఏటా జమ చేస్తున్నారు. గత ఏడాది వేమూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఈ పథకం కింద 955 మంది లబ్ధి పొందగా ఈ ఏడాది 1198 మంది లబ్ధిపొందారు.

దర్జీల పితామహుడు విలియమ్స్ హావే..

దర్జీల పితామహుడు జర్మనీ దేశస్థుడైన విలియమ్స్ హావే 1846లో కుట్టు మిషన్ కనిపెట్టారు. అది నిముషానికి 250 కుట్లు వేసేది. అలా తయారైన కుట్టు మిషన్ అనేక రూపాలలో ఎంతో మందికి ఉపాధి మార్గమైంది. 1867లో కన్నుమూసిన విలియమ్స్‌హావే పేరు స్మరించుకుంటూ దర్జీలందరూ ఫిబ్రవరి 28న దర్జీల దినోత్సవం జరుపుకుంటారు.

దర్జీలకు ఆర్థిక వెసులుబాటు



ఎంతో మంది దర్జీలు వృత్తిని మానేయలేక అందులోనే కొట్టుమిట్టాడుతున్నారు. చేతినిండా పని లేక ఖాళీగా ఉంటున్న తరుణంలో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం ఎంతగానో మేలు చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం దర్జీలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించినట్లయింది.

–షేక్ బషీర్, భట్టిప్రోలు

దర్జీల ఆత్మబంధువు సీఎం జగన్



ఇప్పటి వరకు దర్జీలను గురించి పట్టించుకున్న ప్రభుత్వమే లేదు. మొదటి సారిగా దర్జీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించారు. చేతి వృత్తుల వారి బాధలను అర్థం చేసుకుని వారికి సహాయం అందించడానికి ముందుకు వచ్చారు. ఈ నిర్ణయం ఎంతో మందికి లబ్ధి చేకూర్చింది.

–సయ్యద్ అబ్బాస్ అలీ–(బుజ్జి)–భట్టిప్రోలు

దర్జీల కుటుంబాలలో వెలుగులు



దర్జీల కష్టాలను గుర్తెరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది తొలి బడ్జెట్‌లోనే మా సంక్షేమానికి నిధులు కేటాయించడం హర్షణీయం. మా బాధలను గుర్తించిన మొట్ట మొదటి ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. అనేక మంది దర్జీల కుటుంబాలలో వెలుగులు నింపారు.

–వంగర బాబూజీ, భట్టిప్రోలు

నేర్చుకున్న విద్యతో ఉపాధి



మహిళలు, యువత డిజైన్ దుస్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. రోజు రోజుకి డిజైన్లు మారుతుంటాయి. నేర్చుకున్న దర్జీ పనితో నలుగురికి ఉపాధి చూపిస్తున్నాను. కుటుంబ పోషణలో చేదోడుగా నిలుస్తూ సంతృప్తిగా జీవిస్తున్నాము.

– శిరం పద్మావతి –భట్టిప్రోలు(మహిళా దర్జీ)

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అంది పుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కవిత అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా జరగని విధంగా నాడు–నేడు కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయల ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. చిన్నారులకు జగనన్న గోరుముద్ద ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో ఏటా రూ.15 వేలు జమ చేస్తున్నారని చెప్పారు. సాంకేతిక పరమైన విద్యను అభ్యసించేందుకు 8వ తరగతి విద్యార్థులకు ఖరీదైన ట్యాబ్‌లు అందజేస్తూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని కోరారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలసి డాక్టర్ గణేష్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, జెడ్పీటీసీ మరివాడ వెంకట పావని, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవరపల్లి అమరేంద్ర, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

రైలుపేట(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని రైలుపేటకు చెందిన 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరాయి. ఆదివారం అమృతలూరులోని పార్టీ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సీఎం జగన్ పాలనలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు కుందేటి రమేష్, గద్దె కిషోర్, సముద్రాల ప్రభు కిరణ్, దొడ్డా ప్రదీప్, దారం శ్రీనివాసరావు, సయ్యద్ సిరాజుద్దీన్, జానీ పాల్గొన్నారు.

వైభవంగా బూరుగులమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసి యున్న గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని ఆదివారం రెండో రోజు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ ఆధ్వర్యంలో వేకువ జాము నుంచే అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సద్ది నైవేద్యాలు సమర్పించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మార్కెట్ యార్డు చైర్మన్ దేవగిరి సాంబశివరావులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గుంటూరుకు చెందిన బాలా త్రిపుర సుందరి నృత్యకళా నిలయం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లో సత్తా చాటుదాం

- వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి
- కోళ్లపాలెంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో ఆదివారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అశోక్‌బాబు బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి గ్రామానికి విచ్చేశారు. గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వీరికి స్వాగతం పలికారు. తొలుత గ్రామంలోని గౌతమ బుద్దుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ సొసైటీ భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని అన్నారు. ఇంకా పట్టాలు రావాల్సిన వారికి పట్టాలు త్వరితగతిన ఇప్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మవద్దన్నారు. మాట మీద నిలబడే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అయితే..మోసానికి మారు పేరు చంద్రబాబు అన్నారు. రానున్న ఎన్నికల్లో మనమంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ పార్టీ కన్వీనర్ కొనకాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలా రమేష్, దావూరి నాగమల్లేశ్వరరావు, జల్లి జోషికాంత్, బుస్సా రాజారత్నం, చీకటి రాజేంద్రప్రసాద్, నీలా వాసు, బుస్సా రవి చంద్ర, నీలా నాగరాజు, జల్లి సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభాస్థలి పరిశీలన



సిద్ధం సభ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న అశోక్‌బాబు

వేమూరు: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం పిచ్చికలగుడిపాడు గ్రామంలో నిర్వహించనున్న సిద్ధం సభాస్థలి ప్రాంగణాన్ని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 3న బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలంలో సిద్ధం సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. సభను విజయవంతం చేసేందుకు వేమూరు నియోజకవర్గం నుంచి 500 బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని 30 వేల మంది కార్యకర్తలకు భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చీరాల సమీపంలో నేషనల్ హైవే 216 నెంబరు వద్ద సభ ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజక వర్గం సీనియర్ నాయకులు వరికూటి అమృతపాణి, వేమూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీలకు స్పందన

తెనాలిఅర్బన్: నాజర్‌పేటలోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో ఒకటి నుంచి ఆరో తరగతి చదువుతున్న ముస్లిం విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు ఖురాన్‌లోని సూరాలను చూడకుండా అనర్గళంగా పఠించడం అందరినీ అబ్బుర పరిచింది. గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. అలాగే పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ముఫ్తీ అల్లావుద్దీన్, ఖారీ ఖమ్రుజ్ జామా, హఫీజ్ జుబేర్ సాహెబ్, ముఫ్తీ హైదర్ అలీ సాహెబ్, హఫీజ్ ఇమ్రాన్ బేగ్, ఎస్.ఎస్ సుభానీ, హఫీజ్ అబ్దుల్ ఖరీం, ఖజూర్ సుభానీ, షేక్ నాసర్ అహ్మద్, షేక్ హొహిద్దీన్, డాక్టర్ కమ్మెల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


27 నుంచి రామసాయి మందిర వార్షికోత్సవాలు



కొలకలూరులోని శిరిడీ సాయి మందిరం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శ్రీ రామసాయి జ్ఞాన మందిరంలో వార్షిక మహోత్సవ వేడుకలు ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకు జరగనున్నాయి. మందిరంలోని వేంచేసి యున్న శ్రీ గణపతి, దత్తాత్రేయ, రామదాసు సమేత శ్రీ సద్గురు సాయిబాబా దివ్య మంగళరూప విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరిగి 16 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. 22న ఉదయం వార్షికోత్సవ అంకురార్పణలో భాగంగా శ్రీ బాబావారి పల్లకి గ్రామోత్సవం జరుగుతుంది. అనంతరం ఉదయం గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి దీపారాధన నిర్వహించబడుతుంది. అనంతరం గ్రామంలో భిక్షాటన కార్యక్రమం జరుగుతుంది. రాత్రి ఏడు గంటలకు బాబావారి సన్నిధిలో భారత నాట్య ప్రదర్శన జరుగుతుంది. 28న ఉదయం బాబావారి 108 కలశములతో కలశాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అగస్త్యేశ్వర భజన సమాజం, శ్రీ దత్తారామ సాయి భజన సమాజం వారిచే లలితా, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. రాత్రికి కోలాట ప్రదర్శన ఉంటుంది. 29న నుంచి మార్చి 1వ వరకు గ్రామంలో ఉన్న భజన సమాజం వారిచే సాయినామ సంకీర్తన ఏకాహం నిర్వహించబడుతుంది. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని రామసాయి ట్రస్ట్ చైర్మన్ సతీష్ కోరారు.

మహాశక్తి దేవతగా బండ్లమ్మ వారు



చందోలు(పిట్టలవాని పాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలి రావడంతో భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం మూడవ ఆదివారం కావడంతో అమ్మవారిని మహాశక్తి దేవతగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, బుడ్డా వెంకటలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్ష



చెరుకుపల్లి: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్ష మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష ప్రారంభానికి ముందుగానే రేపల్లె డీఎస్పీ టి మురళీకృష్ణ ఐదు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఇందుకోసం ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్సైలతో పాటు 50మంది సిబ్బందిలో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష రాసేందుకు అభ్యర్థులు జిల్లా నలుమూలల నుంచి ఉదయం 9 గంటలకే కేంద్రానికి చేరుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చినపరిమి, ఆలపాడు, మండూరు, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు, కారుమూరువారిపాలెం, ఆరమండపేట గ్రామాలలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దోనేపూడి అర్జున్‌రావు ఆదివారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమత్తుల నేపథ్యంలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



రేపల్లె రూరల్: విద్యార్థులకు ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ ఏ.మహేష్ అన్నారు. పట్టణంలోని మౌంట్‌ఫోర్ట్ స్కూలులో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విద్యార్థులకు ఏ సర్టిఫికెట్ కోసం రాత పరీక్ష, డ్రిల్ టెస్టులను తెనాలి ఎన్‌సీసీ 22–ఆంధ్రా బెటాలియన్ అధికారుల పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో చిన్న వయస్సులోనే సేవా దృక్పథం అలవడుతుందని అన్నారు. దేశం పట్ల, సమాజం పట్ల అంకిత భావం పెరుగుతుందన్నారు. పోలీసు, ఆర్మీ వంటి ఉద్యోగాలకు ఎన్‌సీసీ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయక్ సుబేదార్ జ్యోతి సింగ్, హవల్దార్ చరణ్‌సింగ్, సీహెచ్‌ఎం జితేంద్ర కుమార్, నాయక్ విక్రమ్‌కుమార్, వివిధ పాఠశాలల ఎన్‌సీసీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన కూడికలు



తెనాలి టౌన్: పట్టణ చెంచుపేట ఇందిరా కాలనీలోని హోరేబు ప్రార్థనా మందిరంలో ఈ నెల 23 నుంచి జరుగుతున్న వార్షికోత్సవ ప్రత్యేక కూడికలు ఆదివారంతో ముగిశాయి. కూడికల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న దైవ సేవకులు, పాస్టర్ గ్లెన్ (చైన్నై) బైబిల్ గ్రంథం నుంచి వాక్యోపదేశం అందజేశారు. దైవసేవకులు ఇమ్మానియేల్ జయరాజ్(విజయవాడ), పాస్టర్ భక్త సింగ్ ఆధ్వర్యంలో కూడికలు నిర్వహించారు. విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు.